## గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

- శంషాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

యాచారం, మార్చి19: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6,7, 8, 9వ తరగతుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు శంషాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు మార్చి 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మల్కాజిగిరి (ఏదులాబాద్, ఘట్‌కేసర్)లో గల ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించి వివిధ విభాగాల్లో కోచింగ్‌తో కూడిన 6వ తరగతి ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఏప్రిల్ 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. మే 5న విద్యార్థులకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు18004254567 8 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తగిన సమాచారం పొందాలని ఆయన సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 320 గ్రాముల గంజాయి పట్టివేత



కొత్తూరు లో పట్టుబడిన గంజాయి

కొత్తూరు, మార్చి 19: 320 గ్రాముల గంజాయిని శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు కొత్తూరు మండల కేంద్రంలో సోమవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపించడంతో శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఉన్న 320 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని కొత్తూరుకు చెందిన ప్రకాశ్ (22), శంషాబాద్‌కు చెందిన గొంగే వెంకటేశ్ (40) గా గుర్తించారు. వారిని విచారించగా పాతబస్తీలోని దూల్‌పేట్ నుంచి గంజాయిని తెచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నామని వివరించారు. అయితే వీరు ఇద్దరి శంషాబాద్‌లోని తాగుడు అడ్డా వద్ద పరిచయం ఏర్పడి గంజాయికి అలవాటు పడి ఈ పని చేస్తున్నారని వివరించారు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

# ప్రత్యేక పూజలు.. అభిషేకాలు

- భక్తిశ్రద్ధలతో సాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు
- నూతన ఆలయాలను దర్శించుకున్న భక్తులు



ఆలయాల్లో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు అభిషేకాలు నిర్వహిస్తున్న వేద పండితులు

కడ్తాల్, మార్చి 19 : మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని రామేశ్వరా వీరాంజనేయ క్షేత్రంలో విగ్రహాల ప్రతిష్ఠానోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం వేద పండితుడు, మహా ఋత్విక్ మెళ్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మంటపారాధన, అగ్నిమధనం, కలశ అభిషేకం, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, అధివసత్రయ హోమం, అగ్ని ధ్యానం, ఉక్త హోమం, కలశ స్థాపన, నవగ్రహ మండపం, కలశ అసాధన, ఆవాహన-ఆరాధన, నవగ్రహ ప్రతిష్ట, చతుర్వేద పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, నరేందర్‌రెడ్డి, ఋత్విక్‌లు పరశురాం భరద్వాజాచార్య, మేళ్లూరి శ్రీనివాసశర్మ, గూడా ధరశర్మ, మాజీ సర్పంచ్ శంకర్, గ్రామస్తులు పర్వతాలు, నర్సింహాగౌడ్, కేశవులు, కృష్ణయ్య, జగన్, రాజాగౌడ్, రామకృష్ణ, శ్రీరాములు, కుమార్, మహేశ్‌యాదవ్, భరత్‌యాదవ్, మల్లేశ్ పాల్గొన్నారు.

## మోదీ సర్కారును గద్దె దింపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్



యాచారం : సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

యాచారం, మార్చి19: రానున్న ఎన్నికల్లో మోదీ సర్కారును గద్దె దింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ అన్నారు. తమ్మలోనిగూడ గేటు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సభను సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అధికారంలోకి వస్తే నల్లధనం వెలికితీసి పేదల ఖాతాల్లో వేస్తానని గద్దెనెక్కిన మోదీ.. అదానీ , అంబానీలకు దాసోహం అయిపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, తావునాయక్, వినోద్, మల్లేశ్, శ్రీమన్నారాయణ, జంగయ్య తదితరులున్నారు.

**స్వరాజ్యం స్ఫూర్తిని కొనసాగించాలి**

ఇబ్రహీంపట్నం/ ఇబ్రహీంపట్నంరూరల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నవాబు పాలనలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చిరుప్రాయంలో తుపాకీ చేతబట్టి భూ స్వాములు, నిజాం రజాకార్లను తరిమికొట్టిన వీరవనిత అని అన్నారు. అలాగే మండల పరిధిలోని దండుమైలారం, రాయపోల్, కప్పాడు గ్రామాల్లో మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు శంకర్, బుగ్గరాములు, గణేశ్, నర్సింహ, శంకర్, చకంటి, శ్రీకాంత్, సయ్యప్ తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో..**

తుర్కయాంజాల్ : సీపీఎం మున్సిపాలిటీ కమిటీ మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్‌కారత్, నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శంకరయ్య, ఆశీర్వాదం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో మల్లుస్వరాజ్యం చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## వేణుగోపాలస్వామి భూముల కౌలుకు వేలం

షాబాద్, మార్చి 19: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయ భూములు కౌలుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఈవో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములు మూడు సంవత్సరాల కాలపరిమితితో తేదీ 01-04-2024 రోజున ఉదయం 11గంటలకు దేవాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ఆరుట్లలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ

మంచాల, మార్చి 19 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మంగళవారం ఆరుట్ల గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును స్వేచ్ఛగా వేయాలని కోరారు. ఆరుట్ల గ్రామంలో ప్రతి ఎన్నికల్లో కొందరు గొడవలు సృష్టించడానికి చూస్తున్నారని, అలాంటి వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ బాబ్యానాయక్, ఏఎస్ఐ సతీశ్, ఎంపీటీసీలు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఐఎస్‌ఏడీఏకే ప్రాజెక్ట్ మేనేజర్ ఇబ్రహీం తదితరులు

షాద్‌నగర్‌రూరల్,మార్చి19: గ్రంథాలయాలు జ్ఞానవృక్షాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌ఏడీఏకే రాయికల్ టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్ మహ్మద్ ఇబ్రహీం అన్నారు. ఫరూఖ్‌నగర్ మండంలోని రాయికల్ ఉన్నత పాఠశాలలో ఐఎస్‌ఏడీఏకే ఆధ్వర్యంలో రూ.9.85 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఆధునిక హంగులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, ఐఎస్‌డీఏకే ఓఅండ్ఎం విశ్వనాథ్, ఎలక్ట్రికల్ ఇంజినీర్ బిజోయ్‌బాబు, కోఆర్డినేటర్ జగదీశ్, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కరించాలని వినతి



కడ్తాల్, మార్చి 19 : భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సాలార్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డిని మంగళవారం కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి భూ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాలార్‌పూర్ గ్రామంలో నెలకొన్న భూ సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. భూముల క్రయ, విక్రయాలు జరుగకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, యాదగిరిరెడ్డి, శంకర్, ప్రకాశ్‌నాయక్, హరి, లక్మా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



కడ్తాల్, మార్చి 19 : తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఈ నెల 26న జరుగనున్నది. ఈ మేరకు మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌ను అంబేద్కర్ గ్రామ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పూలే-అంబేద్కర్ జాతర కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, నాయకులు డేవిడ్, సుధాకర్, మహేశ్, ప్రవీణ్‌కుమార్, మల్లేశ్, వంశీ పాల్గొన్నారు.


## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పూజలో పాల్గొన్న జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తదితరులు

షాబాద్, మార్చి 19 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొల్లూరుగూడ గ్రామంలో మల్లన్న, బీరప్ప దేవాలయంలో అవినాశ్‌రెడ్డి, సాన్విరెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బీరప్ప బోనాల ఉత్సవాలకు తన వంతు సహాయంగా రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పగుడాల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## సొంత నిధులతో బోరు వేయించిన ఎంపీపీ



ఆలయ ఆవరణలో బోరు వేయిస్తున్న దృశ్యం

చేవెళ్ల రూరల్, మార్చి 19 :మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలో నిర్మిస్తున్న మల్లన్న, బీరప్ప ఆలయ ఆవరణలో మంగళవారం సొంత నిధులు వెచ్చించి ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి మంచి నీటి సౌకర్యార్థం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాముల వ్వాలని, దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైభవ్ రెడ్డి, దొడ్డి రాము, శ్రీశైలం, వెంకటేశ్, మహేందర్, నవీన్, మల్లేశ్, రామకృష్ణ, భిక్షపతి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, వెంకటయ్య, అంజయ్య, సత్తయ్య, నర్సింహులు, మధుక పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కడ్తాల్, మార్చి 19: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, సహస్రనామార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త రామచందర్‌రావు, క్రాంతికుమార్, ఆలయ అర్చకులు శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, ఆచార్య ఆదిత్యఆచార్య, చిదంబరశర్మ, శిరీశ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## ఒప్పందంతో విద్యార్థులకు ఉపయోగం

చేవెళ్లటౌన్, మార్చి 19 : ఆగస్త్య ఇంటర్ నేషనల్ ఫౌండేషన్ పరస్పర అవగాహన ఒప్పందం విద్యార్థులకు ఉపయోగపడుతుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత తెలిపారు. మంగళవారం ఫౌండేషన్‌తో 5 సంవత్సరాల అవగాహన ఒప్పందం కుదిరించుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఆవిష్కరణ దిశగా ప్రోత్సహించినందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు వివిధ నైపుణ్యం, పట్టుదల, చురుగ్గా పాల్గొనడం, ఆలోచన అభివృద్ధి, స్వీయ నియంత్రణ, టీమ్ వర్క్, నాయకత్వం, స్వతంత్రంగా ఆలోచించే విధంగా నేర్చుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆగస్త్య ఇంటర్ నేషనల్ ఫౌండేషన్ సభ్యులు దశరత్, రమేశ్, శ్రావణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, షేక్ మహబూబ్, వైష్ణవి, రూప్నారవింద్రన్, జ్యోతి, సతీశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఆవు మృతి

చేవెళ్ల రూరల్, మార్చి 19 : పిడుగుపాటుకు జెర్సీ ఆవు మృత్యువాతపడిన ఘటన చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం.. ఆలూర్ గ్రామానికి చెందిన జోగు వెంకటయ్యకు చెందిన జెర్సీ ఆవును రోజుమాదిరిగా తన పశువుల పాకలో కట్టేశారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పిడుగు పడటంతో జెర్సీ ఆవు మృతి చెందింది.

# రైతుల ఆర్థికాభివృద్ధే సహకార సంఘాల లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ సత్తయ్య



సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయాంజాల్, మార్చి 19 : పరస్పర సహకారంతో రైతుల అభివృద్ధి సాధ్యమని, అందుకు సహకార సంఘాలు రైతులకు చేయూతనందిస్తాయని రంగారెడ్డి సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం 50వ మహాజన సభ మున్సిపాలిటీ పరిధిలోని ఓ గార్డెన్స్‌లో సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల లక్ష్యమన్నారు. తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం 2022-23ఆర్థిక సంవత్సరంలో జిల్లా ఆడిట్ సర్టిఫికెట్ ప్రకారం రూ.3,22,78,142కోట్ల లాభం గడించిందని తెలిపారు. సహకార సంఘం నుంచి దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక, వ్యవసాయేతర అప్పులను సకాలంలో చెల్లించాలని కోరారు. సహకార సంఘం నుంచి వ్యవసాయ అప్పులు పొందిన రైతులు మృతి చెందితే అప్పుదారు కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ భీంరెడ్డి, తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు, సీఈవో రాందాస్ పాల్గొన్నారు.

## ఘనంగా రథోత్సవం

ఆమనగల్లు, మార్చి 19 : పట్టణంలోని అలివేలు మంగ సమేత శ్రీవెంకటగిరి వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవా రం తెల్లవారుజామున ఆలయంలో రథోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులు ఘనంగా నిర్వహించారు. రథాన్ని పచ్చటి తోర ణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను తిల కించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కడ్తాల్, మార్చి 19 : పోషకాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామ పంచాయతీలోని మద్దెలకుంట తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పశుపోషణ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రసాదం, అక్షరాభ్యాసం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో అనేక పోషక విలువలు ఉన్నాయని వివరించారు. నిత్యం ఆహారంలో రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, సాములు, అరికలు తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, నస్రీన్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



షాబాద్, మార్చి 19: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెంకమ్మగూడ, దేవునిగడ్డ గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరేశ్, శ్రీను పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 19 : బలిజగూడ గ్రామంలో వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం 6.45 గంటలకు వీరభద్రస్వామి అభిషేకం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ అంజిరెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరస్వామిగౌడ్, ఐలయ్యగౌడ్, వెంకటేశ్, దాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## రోడ్డును బాగు చేయండి సారూ..



మంచాల, మార్చి 19 : మండలంలోని చిత్తాపూర్ నుంచి తిప్పాయిగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గతుకులమయంగా మారింది. ఈ రోడ్డుపైకి చిత్తాపూర్ గ్రామంలో ఉన్న మురుగు నీరు వచ్చి చేరుతుండడంతో ఒక పక్క దుర్గంధం వెదజల్లడమే కాకుండా మరోపక్క ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దఅంబర్‌పేట, మార్చి 19: విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ కాలేజీ కమాన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (దాదాపు 35 ఏండ్లు) రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు బ్లూకలర్ జీన్స్, చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు.

## అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

షాబాద్, మార్చి 19: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మారెడ్డిగూడలో గౌండ్ల గోపాల్‌గౌడ్ అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దుకాణంపై దాడులు నిర్వహించారు. అతడి వద్ద 30 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న గోపాల్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.